## భైంసాలో పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ రాజారెడ్డి

భైంసా, మార్చి 24 : పట్టణంలో ఆదివారం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోనుకాకుండా ఉండేందుకు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కవాతు నిర్వహించామన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి నిర్మల్ చౌరస్తా వరకు కవాతు కొనసాగింది. ఇక్కడ పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్ఐలు ఉన్నారు.

## ఎన్ఆర్ఐ మిత్రుల చేయూత



పాత ఎల్లాపూర్‌లో పేద కుటుంబానికి సాయం అందజేస్తున్న మిత్రులు

ఖానాపూర్ రూరల్, మార్చి 24 : ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అలిశెట్టి లక్ష్మీ కూతురు వివాహానికి ఎన్ఆర్ఐలు ఆర్థిక సాయం అందించారు. కొన్నేండ్లుగా ఇజ్రాయిల్‌లో ఉంటున్న ఖానాపూర్ పట్టణానికి చెందిన గొల్లవంతుల రాజేశ్వర్, తమ స్నేహితుల సహకారంతో రూ.50లను అలిశెట్టి కుటుంబానికి సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కట్టెకోల నర్సయ్య, గడదాసు రవిచరణ్, నర్సయ్య, చిప్ప దేవన్న, వేముల నాగరాజు, వేముల మహేశ్, కొక్కుల నాగరాజు, బింగి సునీల్, అలిశెట్టి శ్రీనివాస్, కొక్కుల చంద్రశేఖర్, శేఖర్ గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త బండి కదిలింది



దిలావర్‌పూర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో రిపేర్ చేసి వినియోగిస్తున్న చెత్తబండి

దిలావర్‌పూర్ మార్చి 24 : ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించేందుకు పంచాయతీలకు మూడు చక్రాల బండిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చింది. ఇటీవల ఈ బండిని రోడ్డు పక్కన చెత్తలో పడేయగా, చెత్తలో బండి అనే పేరుతో వార్త ప్రచురితం అయ్యింది. స్పందించిన అధికారులు బండిని తీసుకెళ్లి రిపేర్ చేయించి వినియోగంలోనికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్మికుడు గ్రా మంలో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నాడు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి



ఖానాపూర్ రూరల్ : రాజురాలో గ్రామస్తులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్న స్కిల్ ఇండియా అధికారులు

ఖానాపూర్ రూరల్, మార్చి 24 : యువత విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని స్కిల్ ఇండియా, నిర్మల్ జిల్లా యువ పరివర్ధన సంస్థ జిల్లా మేనేజర్ ఆర్తి చవాన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు రాజురాలో ఆదివారం స్కిల్ ఇండియా, నిర్మల్ జిల్లా యువ పరివర్ధన సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంస్థలో మహిళలకు బ్యూటీషియన్, నర్సింగ్, మగ్గం, పురుషులకు ఎలక్ట్రానిక్, హౌస్ వైరింగ్, ప్లంబింగ్, కంప్యూటర్, తదితర పనులపై 45 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ సాయికుమార్, బ్లాంక్ మేనేజర్ మాలావత్ గణేశ్ పాల్గొన్నారు.

## వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం



వాహన తనిఖీలో సరైన పత్రాలు లేని డబ్బులను స్వాధీనం చేసుకున్న పోలీసులు.

నర్సాపూర్ జి, మార్చి 24: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందర వాహన తనిఖీలు చేశారు. ముంబై నుంచి వెల్మల్ గ్రామానికి కారులో ప్రయాణిస్తున్న భైండ్ల నర్సయ్య వద్ద ఎలాంటి పత్రాలు లేని కారణంగా రూ.70వేలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం గ్రీవియన్స్ కమిటీకి పంపుతున్నట్టు ఎస్ఐ హన్మాండ్లు తెలిపారు. ఇందులో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఔషధ ధరలు తగ్గించాలి



కేకు కట్ చేస్తున్న నాయకులు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 24: ఫార్మా రంగంలో ఔషధాల ధరలు తగ్గించి, జీడీపీలో ఐదు శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ విద్యాసాగర్ అన్నారు. నిర్మల్ జిల్లా శాఖ ఆవిర్భావ సమావేశం సీఐటీయూ సంఘ భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నకిలీ, నాసిరకం మందులను అరికట్టాలన్నారు. మందులపై జీఎస్టీ ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. రామకృష్ణ, డా.సంతోష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ తదితరులు ఉన్నారు.

### నూతన కార్యవర్గం ఏర్పాటు

టీఎంఎస్ఆర్‌యూ నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా బీ ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జీ రాజశేఖర్, జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా ప్రమోద్ శ్రావణ్, సందీప్, విజయ్‌కాంత్, ఎనిమిది మంది జిల్లా కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

# ఆదివాసీ గూడేల్లో హోలీ ప్రత్యేకం



దస్తురాబాద్ : కాముని దహానానికి ఏర్పాట్లు చేస్తున్న కుల పెద్దలు



సోన్‌లో కామదాహనం నిర్వహిస్తున్న గ్రామస్తులు

దస్తురాబాద్, మార్చి 24 : ఆదివాసీ గిరిజనులు గూడేల్లో హోలీ పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. గ్రామ పటేళ్ల ఆధ్వర్యంలో ప్రతియేటా వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. కామదహనాన్ని సంప్రదాయబద్దంగా జరుపుకుంటారు. ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయే లెక్క కడుతారు. ప్రతి ఒక్క కుటుంబం నుంచి ఇంటికొక్క కుడక, రెండు చక్కర బిల్లల హారాలు తీసుకవచ్చి గ్రామంలోని పటేల్ ఇంట్లో సమావేశమవుతారు. అనంతరం వచ్చిన కుడకలను బట్టి ఎన్ని కుటుంబాలు ఉన్నాయే అదే వారి లెక్క. ఆదివాసీ గ్రామాల్లో కామదహనంలో మాతరి, మాత్రల్ (ముసలవ్వ, ముసలయ్య) నామంలో రెండు పొడవాటి వెదురు కర్రలను తీసుకొని వాటికి కొన భాగంలో వాలుగా చతుస్రాకారంలో సన్నని పట్టీలకు కుడక, ఉల్లిగడ్డలు, గారెలు, వంకాయలను వేలాడదీస్తారు. ఆ తరవాత పొడగాటి కర్రలకు కింది భాగంలో నిప్పు పెట్టడం (కామ దహనం) చేయడం జరుగుతుంది. ఇందులో (మాతరి ముసలవ్వ–మాత్రల్ ముసలయ్య)గా అభివర్ణిస్తారు. వెదురు బొంగులకు అలకరించిన మాతరి, మాత్రల్‌ను డప్పు, డోలు, వాయిద్యాల చప్పుళ్లతో గ్రామ పొలిమేర వరకు తీసుకవెళ్లి కామ దాహనం గోండుల ఆచార వ్యవహారాలతో నిర్వహిస్తారు. దహనం చేసిన అగ్నిగుండం చుట్టూ సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ హోలీ సంబురాలను జరుపుకుంటారు. కామ దహనంలో ఏది ముందుగా పడిపోతుందో ఈ సంవత్సరం వాళ్ల అదృష్ట సంవత్సరంగా భావిస్తారు. అయితే ఆ సమయంలో కొత్తగా పెండ్లి చేసుకుంటారో, తల్లిదండ్రుల నుంచి వేరుపడిన కొడుకు–కోడళ్లు కుడక తీసుకపోవడం జరుగుతుంది. అప్పటి నుంచి ఆ గ్రామంలో ఇంకో కుటుంబం పెరిగిందని లెక్కిస్తారు. మరుసటి రోజు(హోలీ) ఉదయం అన్ని రకాల ధాన్యగింజలతో తయారు చేసిన నైవేద్యాన్ని అక్కడే అందరూ కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. గోగిపూలతో తయారు చేసిన రంగు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ హోలీ వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. అనంతరం గ్రామంలో ఎన్ని గడపలు ఉన్నాయో ఆ ఇంటింటికీ వెళ్లి కామ దహన బూడిదని గుమ్మానికి ఎదురుగా పోస్తామని, అలా పోస్తే క్రిమికీటకాలు రావని, అంత మంచిగా జరుగుతుందని, ఈ సంవత్సరం ఖరీఫ్ పంటలు సమృద్ధిగా పండుతాయిని గిరిజనుల నమ్మకం.

### ఘనంగా కామదహనం

సోన్, మార్చి 24 : సోన్, నిర్మల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో నుంచి పిడుకలు, పాత వస్తువులను ఒక్క దగ్గర చేర్చి కామదాహనం చేశారు. నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్, లంగ్డాపూర్, చిట్యాల్, రత్నాపూర్‌కాండ్లీ, ముజ్గి, నీలాయిపేట్, డ్యాంగాపూర్, అక్కాపూర్‌తోపాటు సిద్దులకుంట, కూచన్‌పెల్లి, సంగంపేట్, పాక్‌పట్ల, మాదాపూర్‌ల్ కామ దహనం నిర్వహించారు.

భైంసా, మార్చి 24 : పట్టణంలోని కిసాన్ గల్లీ, నేతాజీ నగర్, భట్టిగల్లి, పులేనగర్, కాలోని, గోపాల కృష్ణమందిర్‌లో ఆదివారం కామ దహనం నిర్వహించారు. ముందుగా గోపాల కృష్ణమందిర్ వద్ద పూజలు చేశారు. అనంతరం ఆయా ఏరియాల్లో కామదహనం నిర్వహించారు.

నర్సాపూర్ జీ, మార్చి 24: మండల కేంద్రంలో ఆదివారం కామ దహనాన్ని నిర్వహించారు. పండితులు నరహరి శర్మ కామ దహనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిన్న రామయ్య, తాజా మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు కొండ్ర రమేశ్, ప్యాట్ల రాజారెడ్డి, నిమ్మ రాములు, డా.సాయన్న గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



భైంసా: కిసాన్ గల్లీలో కామదహనం



నర్సాపూర్ జీ :కామ దహనంలో పాల్గొన్న నాయకులు



దస్తురాబాద్ : కాముని దహనం కుల పెద్దలు



రేణుకమాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకవస్తున్న భక్తులు

## రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

సోన్, మార్చి 24: నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ మండలంలోని అక్కాపూర్ సమీపంలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ విగ్ర హ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గీత సహకార సంఘం నుంచి రేణుకమాత సహా ఇతర దేవతల విగ్రహాలను అక్కాపూర్ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇక్కడ గౌడ సంఘం ప్రతినిధులు లింగాగౌడ్, జీవన్‌గౌడ్, డాక్టర్ రమణగౌడ్, రాజాగౌడ్, దేవేందర్‌గౌడ్, వేణుగోపాల్ గౌడ్, కృష్ణమోహన్‌గౌడ్, రవీందర్ గౌడ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, దశగౌడ్, నర్సాగౌడ్, వెంకగౌడ్, రాజాగౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా హోలీ సంబురాలు



ఖానాపూర్ : తెలంగాణ చౌరస్తాలో రంగులు నృత్యాలు చేస్తున్న నాయకులు

ఖానాపూర్, మార్చి 24 : పట్టణంలో ఆదివారం హోలీ పండుగను యువత, రాజకీయ నాయకులు ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ చౌరస్తాలో పెద్ద సంఖ్యలో యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ సంబురాలు నిర్వహించారు. మున్సిపల్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనంలో రంగుల డ్రమ్ములు పెట్టి పురవీధుల్లో తిరుగుతూ సందడి చేశారు. సీఐ సదారావు, ఎస్ఐ లింబాంద్రి హోలీ పండుగ సందర్భంగా మున్సిపాలిటీలో ఎలాంటి అల్లర్లు జరుగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, హిందూ ఉత్సవ కమిటీ నాయకులు, కౌన్సిలర్లు, యువకులు,నాయకులు పాల్గొన్నారు.

కుంటాల, మార్చి 24 : మండలంలోని కల్లూరు కేజీబీవీలో ఆదివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకొని సంబురంగా గడిపారు.

కుభీర్, మార్చి 24 : మండలకేంద్రంలోని చాణ్యక్య పాఠశాలలో కామదహనం, హోలీ వేడుకలను ఆదివారం పోషకులు, అధ్యాపకులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నరేశ్ పండుగ విశిష్టతను వివరించారు. మండలంలోని గ్రామాల్లో కామదహనం నిర్వహించారు.

దస్తురాబాద్, మార్చి 24 : మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట, తదితర గ్రామాల్లో ఆదివారం హోలీ వేడుకను జరుపుకున్నారు. చిన్న పెద్ద రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు కేరింతలతో హోలీ పండుగను జరుపుకున్నారు.



కుంటాల : కల్లూరు కేజీబీవీలో హోలీ పండుగ జరుపుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



దస్తురాబాద్ : హోలీ వేడుకలను నిర్వహించుకుంటున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది

# శత శాతం లక్ష్యంగా..

- ఇప్పటివరకు 94 శాతం ఇంటి పన్నులు వసూలు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.33,12,629
- వసూళ్లయిన రూ.31,28,527
- పన్ను వసూళ్లలో జిల్లాలో మూడో స్థానం



దస్తురాబాద్, మార్చి 24 : గ్రామ పంచాయతీల ఖజానాలకు కొద్ది రోజులుగా నిధులు జమవుతున్నాయి. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచారు. పల్లెల అభివృద్ధికి పన్నులే కీలకం. ప్రభుత్వాలు విడుదల నిధులతోపాటు ఇంటి పన్నులు సైతం ఆదాయ వనరులుగా మారాయి. ఇంటి పన్నుల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రతి ఆర్థిక సంవత్సరం చివరలో ఇంటి పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపడుతుంది. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను, పన్నేతర ఆదాయం వసూలు ముమ్మరంగా కొనసాగుతుంది. అధికారులు, సిబ్బంది పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 4,853 ఇండ్లు ఉండగా మొత్తం ఇంటి పన్ను రూ.33,12,629 లక్షలను టార్గెట్‌ను నిర్దేశించగా, ఇప్పటివరకు రూ.31, 28,527 లక్షలు వసూలు చేశారు. దీంతో జిల్లాలో 94 శాతం వసూళ్లతో మండలం మూడో స్థానంలో ఉంది. ఈ నెల ఆఖరి వరకు 100 శాతం లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇంకా ఇంటి పన్ను రూ.1,84,102 పెండింగ్‌లో ఉంది.

### 94 శాతం పన్ను వసూలు

ప్రజలు ముందుకు వచ్చి ఇంటి పన్నులను చెల్లిస్తున్నారు. పంచాయతీల్లో వంద శాతం చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. మార్చి నెలాఖరు వరకు వంత శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంది. మండలంలో 13 గ్రామ పంచాయతీలకు కలిపి 94 శాతం ఇంటి పన్నులను వసూళ్లు చేసి, మండలాన్ని మూడో స్థానంలో నిలిపారు. ఆకొండపేట, పెర్కపల్లె గ్రామ పంచాయతీల్లో 100 శాతం పన్నుల వసూళ్లు పూర్తి కాగా, మున్యాల తండా 99 శాతం అయ్యాయి. మిగతా గ్రామ పంచాయతీల్లో 90 శాతం పైగా పన్నులు వసూలు చేశారు.



### అందరి సహకారంతో..



మండలంలో వంద శాతం పన్నుల వసూళ్లకు కృషి చేస్తున్నాం. ఇచ్చిన టార్గెట్ రూ.33,12,629 లక్షలు ఇవ్వగా ఇప్పటివరకు రూ.31,28, 527 లక్షలు వసూ లు చేశాం. 94 శాతం ఇంటి పన్నును వసూలు చేసి జిల్లాలో మూడో స్థానంలో నిలిచాం. లక్ష్యాన్ని చేరేందుకు అందరి సహకారంతో ముందుకు వెళ్తున్నాం. త్వరలోనే వంద శాతం ఇంటి పన్నును వసూలు చేస్తాం. యజమానులు పన్ను వసూళ్లకు వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సహకరించి ఇంటి పన్నును చెల్లించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలి.

**పీ అనిల్ కుమార్, మండల పంచాయతీ అధికారి,దస్తురాబాద్**

## సోన్‌లో చలివేంద్రం ప్రారంభం



సోన్‌లోని చలివేంద్రంలో నీటిని అందిస్తున్న ఎంపీవో కలీం

సోన్, మార్చి 24: సోన్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఎంపీడీవో సురేశ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండకాలం దృష్ట్యా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని, వివిధ అవసరాల కోసం బయటకు వెళ్లిన వారు ఉపయోగించుకోవాలని కోరారు. ఇక్కడ ఎంపీవో కలీం, గ్రామ కార్యదర్శులు లక్ష్మణ్, సృజిత్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూలర్ల వితరణ



దాత అన్వేష్ కుమార్‌ను సన్మానిస్తున్న హనుమాన్ భక్తులు

కుంటాల, మార్చి 24: మండల కేంద్రంలోని వీర హనుమాన్ ఆలయంలో హనుమాన్ భక్తుల కోసం ప్రభుత్వోద్యోగి అన్వేష్ కుమార్ రెండు కూలర్లను విరాళంగా అందజేశాడు. అనంతరం భక్తులకు అన్నదానం చేశాడు. ఇక్కడ గురుస్వామి భుజంగం గణపతి, నవీన్, అన్వేష్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దేశీదారు పట్టివేత

కుభీర్, మార్చి 24 : మండల కేంద్రం కుభీర్‌లోని పాపన్న తన కొట్టంలో దేశీదారు అక్రమ మద్యం అమ్ముతుండగా పట్టుకున్నామని ఎస్ఐ రవీందర్ తెలిపారు. రూ. 6,912 విలువైన 17.28 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు తెలిపారు.

## గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్యాయత్నం

బాసర, మార్చి 24 : గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఒక వ్యక్తిని కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. వివరాల ప్రకారం, మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కేంద్రానికి చెందిన సుభాష్ వాగ్మారే (52)గా ఆదివారం రైల్వే బ్రిడ్జి వద్ద గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అక్కడే స్నానం చేస్తున్న బిద్రెల్లికి చెందిన హనుమాన్ మాలధారుడు గమనించి ఎస్ఐ గణేశ్‌కు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న ఆయన గంగపుత్రుల సహాయంతో సుభాష్‌ను కాపాడారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## కుక్కల దాడిలో తొమ్మిది గొర్రెలు మృతి

సోన్, మార్చి 24 : కడ్తాల్ గ్రామానికి చెందిన భూమేష్ ఇంటి సమీపంలోని గొర్రెల మందలో వీధి కుక్కలు చొరబడి దాడి చేయడంతో సుమారు తొమ్మిది గొర్రెలు మృతి చెందినట్లు రైతు తెలిపాడు. గాయపడ్డ గొర్రెలకు పశు వైద్యాధికారి డాక్టర్ మహేశ్ చికిత్స అందించారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

దిలావర్‌పూర్ మార్చి 24 : దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన బెజ్జారం నరేశ్ (34) ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం, నరేష్ అప్పుల బాధ భరించలేక మద్యానికి బానిసయ్యాడన్నారు. ఆదివారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లోనే చీరతో ఉరి వేసుకున్నాడని తెలిపారు. నరేశ్‌కు తల్లి, అన్న ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రసాయన రంగులతో జాగ్రత్త

భైంసా, మార్చి, 24 : రసాయన రంగులతో చర్మానికి, కంటికి, ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని పిల్లల వైద్య నిపుణుడు అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, హోలీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సహజ రంగులతో పండుగ జరుపుకోవాలని సూచించారు.

## నలుగురిపై కేసు

సారంగాపూర్, మార్చి 24 : మండలంలోని స్వర్ణ–నిర్మల్ రహదారిపై లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఎస్ఐ చంద్రమోహన్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ రహదారి గుండా వచ్చే ప్రతి వాహనాన్ని క్షణంగా తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

## ముథోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి

ముథోల్, మార్చి, 24 : భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరైన మంత్రి సీతక్కతో ముథోల్‌ను మున్సిపాలిటీ చేయాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్ వినతి పత్రాన్ని అందజేశారు. ముథోల్‌లో 25 వేల జనాభాతోపాటు 12వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారని తెలిపారు. మున్సిపాలిటీ అయితే ముథోల్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.



నిర్మల్‌లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

## కుష్టు నివారణపై సర్వే

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 24 : కుష్టు వ్యాధి నియంత్రణే లక్ష్యంగా చేపడుతున్న సర్వే కొనసాగుతున్నది. నిర్మల్ పట్టణంలోని రాంనగర్, బంగల్‌పేట దవాఖాన పరిధిలోని ప్రాంతాల్లో ఆదివారం వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

## శ్రీకృష్ణ ఆలయంలో మహా సత్సంగ్



ప్రవచనం చేస్తున్న రెడ్డి మహారాజ్

కుంటాల, మార్చి 24 : మండల కేంద్రంలోని ప్రాచీన శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం పౌర్ణమి కామదహనం సందర్భంగా మహారాష్ట్రలోని చిక్లికు చెందిన రెడ్డి మహారాజ్ ఆధ్వర్యంలో మహా సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డి మహారాజ్ ప్రవచనాలు వినిపించారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు శంకర్, తాటి శివ, కృష్ణారావు పాల్గొన్నారు.